క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ రామ్మోహనరావు

బొబ్బిలిరూరల్: స్వర్ణాంధ్ర– బీట్ ది హీట్ కార్యక్రమంలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాల యం వద్ద శనివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్డీఓ జె.వి.ఎల్.రామ్మోహన రావు ప్రారం భించారు.అనంతరం సబ్ ట్రెజరీ, తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ శ్రీను, రెవెన్యూ సిబ్బంది మొక్క లు నాటారు. హెచ్‌డీటీ సుబ్బారావు, తదితరు లు పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్టివేత



వీధి కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని పలు వీధుల్లో కుక్కలను మున్సిపల్ అధికారుల సమక్షంలో సిబ్బంది శనివారం పట్టుకున్నారు. ఈనెల 16న కాలెపు వీధికి చెందిన చిన్నారిపై వీధి కుక్కలు దాడిచేసి గాయపరిచిన విషయం విధితమే. ఈ ఘటనకు స్పందించిన అధికారు లు కుక్కలను పట్టించారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలో విచ్చలవిడిగా స్వైరవిహారం చేస్తున్న కుక్కలపై దృష్టిసారించాలని పట్టణవాసులు కోరుతు న్నారు.

ఆయుర్వేద వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి సునీల్

రేగిడి: ఖండ్యాం గ్రామంలో స్థానిక ఆయుర్వేద వైద్యశాల అధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యం లో శని వారం వైద్యశిబిరం నిర్వహించారు. కీళ్ల, నడుము నొప్పితో బాధపడుతున్న, దీర్ఘ కాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు చేసి అవసరమైన ఆయు ర్వేద మందులను ఉచితంగా అందజేశారు.పం చాయతీ కార్యదర్శి పోలినాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



పూజలు చేస్తున్న మందిర నిర్వాహకులు

రాజాం సిటీ: స్థానిక కంచరవీధిలోని సత్య సాయి మందిరంలో భగవాన్ సత్యసాయి బాబా పాలరాతి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు మం దిర కన్వీనర్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభ మయ్యాయి .మూడురోజుల పాటు నిర్వహిం చనున్న ఉత్సవాల్లో తొలిరోజు చిలుకూరి చంటి శర్మ ఆధ్వర్యంలో విద్యోపాసకులు బంకుపల్లి వెంకట భాస్కరశర్మ పర్యవేక్షణలో పూజా కార్య క్రమాలు చేపట్టారు. సత్యసాయి పాలరాతి విగ్రహాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జునరావు, వరలక్ష్మి దంపతులు, వెండి యంత్రాన్ని గట్టి పాపారావు, పద్మావతి దంప తులు సమకూర్చారని నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి మంతాలమ్మ పండగ



పూజలందుకుంటున్న మంతాలమ్మ

బాడంగి:మండలంలోని పినపెంకి గ్రామంలో మంతాలమ్మ పండగ ఆదివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిం చనున్నట్టు ఆగ్రామ పెద్దలు, ఆర్యవైశ్య సంఘ నాయకుడు పూసర్ల నర్సింగరావు శనివారం తెలిపారు. ఆదివారం ఉయ్యాల కంబాలతో పండగ ప్రారంభమవు తుందని, సోమవారం తొల్లేళ్ల ఉత్సవం, ఘటాల తిరువీధి, మంగళవారం అంజలి రథం, ఘటాల ఊరేగింపు ఉంటుం దని పేర్కొన్నారు. బుధవారం అనుపోత్సవం తో పండగ ముగుస్తుందని, మూడురోజులూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

శిథిలం..ఛిద్రం

- ప్రమాదకరంగా వంతెనలు, కల్వర్టులు
- వంతెనలపై గోతులు, శిథిలమైన రక్షణ గోడలు
- బిక్కుబిక్కు మంటూ రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు, ప్రయాణికులు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని ప్రధాన రహదారుల్లో పలుగ్రామాల వద్ద నదులు, గెడ్డలపై వంతెన లు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా తయారయ్యాయి. ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో కూలేద శకు చేరుకున్నాయి. రక్షణ గోడలు, రెయిలింగ్స్ ధ్వంసమయ్యాయి. వంతెనలు, కల్వర్టులు కనీస మరమ్మ తులకు నోచుకోకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆయా మార్గాల్లో ప్రయాణించే వారు భయాందోళన చెందుతున్నారు.

● రక్షణ గోడల ఆనవాళ్లే లేవు..



సంతకవిటి: శిథిలావస్థకు చేరిన మల్లయ్యపేట వంతెన

సంతకవిటి: మండలంలోని మల్లయ్యపేట గ్రామం వద్ద నారాయణపురం కుడి ప్రధాన కాలువపై ఉన్న వంతెన ఎప్పుడు కూలిపోతుందో తెలి యని స్థితిలో ఉంది. దాదాపు 60 ఏళ్ల క్రితం ఈ వంతెనను నిర్మిం చారు. ఇరువైపులా రక్షణ గోడలు పూర్తిగా కూలిపోయి ఆనవాళ్లే లేకుండా పోయాయి. వంతెన దిగువ భాగాన సిమెంట్ పెచ్చులూడి ఇనుప ఊచ లు బయటకు కనిపిస్తున్నాయి. గోడలు బీటలు వారుతు న్నాయి. ఈ మార్గంలో నిత్యం వందల సం ఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాలతో పాటు ప్రధానంగా ఇసుక ట్రాక్టర్లు, కర్రల లోడ్‌లతో ట్రాక్టర్లు ఎక్కువగా వెళు తుంటాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన కావడంతో పటుత్వం కోల్పోయిందని, ఏ క్షణం లోనైనా కూలిపోయే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. వంతెన కూలిపోక ముందే కొత్త వం తెన నిర్మించాలని కోరుతున్నారు.

ఊడిన రెయిలింగ్.. ఆదమరిస్తే అంతే..



వంతెనపై ఓ వైపు పూర్తిగా ఊడిపోయిన రెయిలింగ్

రాజాం: మండలంలోని అంతకాపల్లి బాలజీ టెం పుల్ సమీపంలో సారథి గెడ్డపై వంతెన ప్రమాద కరంగా మారింది. ఒక వైపు రెయిలింగ్ పూర్తిగా ఊడిపోయింది. అటు ఆర్‌అండ్‌బీ అధికారులతో పాటు ఇటు పోలీసులు కూడా ఈ వంతెనను పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు అధికమవు తున్నాయి. ఉన్నతాధికారులు, పోలీసులు స్పం దించి ఇక్కడ రెయిలింగ్ తో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

● కల్వర్టుల వద్ద కుంగుతున్న రోడ్డు



భీమవరం- ముగడ రోడ్డులో కల్వర్టు వద్ద కుంగిన రోడ్డు

బాడంగి: మండల కేంద్రాన్ని బొబ్బిలి మండ లాలను కలిపే రహదారిలో కల్వర్టులు శిథిలం కావ డంతో పాటు ఆ ప్రాంతాల్లో రోడ్డు పూర్తిగా దెబ్బతింది.బాడంగి నుంచి ముగడ, భీమవరం, రంగరాయపురం, అప్పయ్యపేట గ్రామాల మీదు గా దగ్గర మార్గంలో బొబ్బిలి చేరుకోవచ్చు. ఈమా ర్గం సుమారు 14 కిలోమీటర్లు ఉంటుంది.అదే రామభద్రపురం మీదుగా బొబ్బిలి 24 కిలోమీటర్లు ఉంటుంది. అందుకే ఎక్కువ మంది ఈ మార్గాన్నే ఎంచుకుంటారు. ఈ రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గత రెండే ళ్లలో రోడ్డు మొత్తం పాడైపోగా ముగడ చినమంద పాలంవద్ద, భీమవరం పాత్రేరు చానల్‌వద్ద, జె.రం గరాయపురం దగ్గర కల్వర్టులు దెబ్బతిన్నాయని, పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్ప టికైనా పాలకులు, అధికారులు స్పందించి కొత్త కల ్వర్టులు నిర్మించాలని, రోడ్డు మరమ్మతులు చేయా లని ప్రజలు కోరుతున్నారు.

● ధ్వంసమైన రక్షణ గోడలు



తెర్లాం: పణుకువలస-వెలగవలస మధ్య వంతెనపై ధ్వంసమైన గోడ

తెర్లాం: నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రాజాం–రామభద్రపురం రోడ్డులో పణుకు వలస–వెలగవలస గ్రామాల మధ్యన ఉన్న వం తెన ప్రమాదకరంగా మారింది. వంతెన శిథిలావ స్థకు చేరుకుంది. ఇటీవల వంతెన రక్షణ గోడను లారీ ఢీకొనడంతో ధ్వంసమైంది. ఇక్కడ రాత్రివేళ ల్లో ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇక్కడ ఆర్‌అండ్‌బీ అధికారులు రేడియం స్టిక్కరిం గ్‌తో హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయకపోవ డంపై వాహనచోదకులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వంతెన రక్షణ గోడకు మరమ్మతులు చేపట్టాలని, రెండు వైపులా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతు న్నారు.



వంతెనపై తేలిన గోతులు, శిథలమై కూలిపోతున్న రక్షణ గోడ

● వంతెనపై గోతులు...

రేగిడి : మండలంలోని సంకిలి వద్ద నాగావళి నదిపై వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు బ్రిడ్జిపై రోడ్డు ఎక్కడికక్కడ గోతులు తేలింది. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడు తున్నారు. గోతులను పూడ్చక పోవడంతో అవి మరింత పెద్దవిగా మారుతు న్నాయి. వీటి వల్ల ప్రమాదాలు జరగడంతో పాటు వంతెనకు కూడా ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆమార్గంలో ప్రయాణించే వారు అంటున్నారు. అలాగే వంతె నపై ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గోడలు మధ్యమధ్యలో కొంతమేర కూలిపోయాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందిం చి వంతెనపై ఏర్పడిన గోతులు పూడ్చడంతో పాటు రక్షణ గోడలకు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిధులు దోచేస్తున్నారు..



మాట్లాడుతున్న ఒమ్మి రమణ, అప్పన్న

బొబ్బిలి: స్థానిక సింహాల తోటలోని ఏపీ రెసిడె న్షియల్ పాఠశాలలో మరమ్మ తులకు విడుదలైన నిధులను కాంట్రాక్టర్ దోచేస్తున్నారనీ, అతనికి ప్రిన్సిపాల్ కూడా సహకరిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ఆరోపించారు. పట్టణంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ గ్రౌండ్ చదును పనులకు సుమారు రూ.5లక్షలు మంజూర య్యాయని, ఈనిధులను వీలైనంత స్వాహా చేసే పనిలో కాం ట్రాక్టర్ ఉన్నారని అన్నారు. గ్రౌండ్ చదును చేసేం దుకు పాఠశాల ఆవరణలోని పాత భవనాల పక్కనే మట్టితవ్వుతున్నారని, అక్కడి మట్టి తవ్వి అక్కడే పోస్తున్నారన్నారు.వేరే ప్రాంతం నుంచి మట్టితే వాల్సి ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ ఆ పని చేయడం లేదని, పాత భవనాల పక్కన పెద్ద గోతులు తవ్వి వదిలేశారని మండిపడ్డారు. దీనిపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామంగా కొయ్యికొండవలస



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ చిన్నంనాయుడు

బొబ్బిలిరూరల్: మండలంలోని కొయ్యికొండవ లస గిరిజన గ్రామాన్ని సారా రహిత గ్రామంగా ఎక్సైజ్ సీఐ చిన్నం నాయుడు ప్రకటించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామ స్తులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కొంతకాలంగా నిర్వహిం చిన నవోదయం 2.0 కార్యక్రమం విజయవంత మైందన్నారు.గతంలో సారా తయారీకి సంబంధిం చి ఈ గ్రామాన్ని బీ–కేటగిరిలో ఉంచామని, మూడు నెలలుగా గ్రామంలో సారా తయారీ,విక్ర యాలు లేకపోవడం శుభపరిణామమన్నారు. తాము చేపట్టిన కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి మంచి స్పందన వచ్చిందని అన్నారు.కార్యక్రమం లో ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీలు జారీచేయాలి



రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బందితో సమావేశమైన తహసీల్దార్ సుధాకర్

బాడంగి: మండలంలోని కౌలు రైతులను గుర్తించి సీసీఆర్‌సీ(పంట సాగుదారు హక్కు పత్రం)లు జారీ చేయాలని తహసీల్దార్ కె.సుధాకర్ వీఆర్ ఓలు, వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహిం చిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం పేరిట పెట్టుబడి సహాయం అందించనున్నందున కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు అందించాలని సూచించారు. అలాగే వాడాడ లో చేపడుతున్న భూరీసర్వేపనులపై ఆరా తీశారు. రెవెన్యూ అంశాలు, సమస్యలపై చర్చించారు. గృ హనిర్మాణాలకు అవసరమైన ఎల్‌పీసీ ధ్రువీ కర ణపత్రాలు మంజూరుపై దిశానిర్దేశం చేశారు. మం డల వ్యవసాయ అధికారి శిరీష, హెచ్‌డీటీ ధనం, రీసర్వే డీటీ అప్పలనాయుడు, మండల సర్వేయర్ వెంకటరమణ, ఎంఆర్ఐ జగదాంబ పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీలో పశువులు కడితే చర్యలు



ఎస్‌డబ్ల్యూపీసీని శుభ్రం చేయిస్తున్న ఈఓపీఆర్డీ నీలిమ, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరావు

సాక్షి ఎఫెక్ట్...

తెర్లాం: మండల కేంద్రంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం (ఎస్‌డబ్ల్యూపీసీ)లో పశువులు కట్టి నా, కార్లు పార్కింగ్ చేసినా సంబం ధిత వ్యక్తులపై చర్యలు తీసుకుం టామని ఈఓపీఆర్డీ నీలిమ హెచ్చ రించారు. 'పశువుల శాలగా ఎస్‌డబ్ల్యూ పీసీ' శీర్షిక తో సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన కథ నానికి ఎంపీడీఓ రేగి రాంబాబు స్పందించారు. ఈఓపీఆర్డీ నీలిమ, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరావును ఎస్‌డబ్ల్యూపీసీ వద్దకు పంపిం చి పశువులు కట్టకుండా, కార్లు పార్కింగ్ చేయకుం డా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే వారు ఎస్‌డబ్ల్యూపీసీని సందర్శించారు. అక్కడ పశువులు కడుతున్న వ్యక్తిని పిలిపించి ఎస్‌డబ్ల్యూపీ సీని శుభ్రం చేయించారు. కార్లు పార్కింగ్ చేస్తున్న వారితో మాట్లాడి ఇకపై ఎస్‌డబ్ల్యూపీసీలో కార్లు పెట్టవద్దని సూచించారు.

పైపులైన్‌కు మరమ్మతులు



పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ సాయిరాం

తెర్లాం: మండలంలోని అరసబలగ గ్రామంలో తాగునీటి పథకానికి సంబంధిం చిన పైపులైన్ కొన్నిరోజులుగా లీకవుతుండడంతో సక్రమంగా తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో సర్పంచ్ కొరగంజి సాయిరాం పైపులైన్‌కు శనివారం మర మ్మతులు చేయించారు. వేసవిని దృష్టిలో ఉంచు కుని గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చర్య లు తీసుకుంటున్నామని సర్పంచ్ చెప్పారు.

● తుప్పలు తొలగించరూ..



రాజాం మండలంలోని మారేడుబాక గ్రామం నుంచి కొత్తవలస, అంతకాపల్లి గ్రామాల మీదుగా ప్రవహి స్తున్న సారథి గెడ్డలో తుప్పలు, డొంకలు తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. వర్షాకాలంలో చెరువుల వరదనీటితో ప్రవహించే ఈ కాలువలో పూర్తిగా రెల్లిగడ్డి, ముళ్లపొదలు పేరుకుపోయి, కాలువ ద్వారా నీరు దిగువకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, ఈ వేసవిలో ఉపాధి హామీ పనుల ద్వారా కాలువను బాగుచేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. – రాజాం

● అంబేడ్కర్ చిత్రపటాల పంపిణీ



పోతులజగ్గుపేట గ్రామంలోని దళిత కుటుంబాలకు సిరిపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బొత్స జానకీ రావు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటాలను శనివారం పంపిణీ చేశారు. జానకీరావు మాట్లాడుతూ ఇటీవల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేసిన సమయంలో గ్రామస్తులకు ఇచ్చిన మాట ప్రకారం అంబేడ్కర్ చిత్రపటాలను అందించానని చెప్పారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. జరజాన సింహాచలం, తదితరులు పాల్గొన్నారు. – సంతకవిటి

● దశపత్ర కషాయంతో తెగుళ్లకు చెక్



మొక్కజొన్న ,ఇతర పంటలను ఆశించే తెగుళ్లను దశపత్ర కషాయంతో నివారించవచ్చని ప్రకృతి వ్యవ సాయం ఎల్–2లు గౌరీశ్వరరా వు, సురేష్ చెప్పారు. రేగిడి మండలంలోని చాటాయివలస గ్రామంలో ఎన్ పీఎం షాపు వద్ద ఏఓ మురళీకృష్ణ ఆధ్వర్యంలో రైతులకు దశపత్ర కషాయం తయారీపై శనివారం అవ గాహన కల్పించారు. దేశీ ఆవుమూత్రం, వేప, సీతాఫలం, బొప్పాయి, మునగ, పొగాకు, కలబంద, జామ, అతిబల, మారేడు, ఆముద, జిల్లేడు ఆకులతో పాటు పచ్చిమిర్చి, వెల్లుల్లితో కషాయం తయారు చేసే విధా నాన్ని ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. 40 రోజుల తర్వాత ఈ కషాయాన్ని పంటలకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. వీఏఏ శ్రీనివాసరావు, ఐసీఆర్‌పీలు ఫైల తవిటినాయుడు, గోవింద, శ్రీలత పాల్గొన్నారు. – రేగిడి

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహద పడతాయని, ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పరిసరాల పరిశుభ్రత పాటిం చాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపు నిచ్చారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో అధికారులు శనివా రం స్వర్ణాంధ్ర –స్వ చ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు కలిసి ర్యాలీలు చేశారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లో ఈ నెలఅంశంగా ఉష్ణతాపం నుంచి ఉపశమనం (బీట్ ది హీట్)పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో చలివేం ద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రభుత్వ కార్యాలయా లు, పాఠశాలలు, ఆస్పత్రుల ఆవరణలో, రోడ్లకు ఇరు వైపులా మొక్కలు నాటారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



రాజాం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



బాడంగి: మండల కేంద్రంలోని ఆస్పత్రి ఆవరణలో మొక్కలునాటుతున్న అధికారులు



వంగర: పోలీస్ స్టేషన్ వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న పోలీస్ అధికారులు



తెర్లాం: మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ రాంబాబు, తహసీల్దార్ హేమంత్‌కుమార్



రామభద్రపురం: రామభద్రపురంలోని పూడి వీధి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ రత్నం



సంతకవిటి: సంతకవిటిలోని అంబేడ్కర్ కూడలిలో చలివేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు



బొబ్బిలి: బొబ్బిలి చర్చి సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ కమిషనర్రామలక్ష్మి, వైస్ చైర్మన్ రమాదేవి, తదితరులు



రేగిడి: రేగిడి పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది